క్లుప్తంగా

తైక్వాండో పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



తెనాలిఅర్బన్: రాష్ట్ర స్థాయి తైక్వాండో సబ్ జూనియర్ పోటీల్లో అండర్ 41 కేజీల విభాగంలో బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం హైస్కూల్‌లో అయిదోవ తరగతి చదువుతున్న కె లారా సౌందర్య బంగారు పతకం సాధించిందని ప్రధానోపాధ్యాయులు పి రాము తెలిపారు. పోటీలను విజయనగరంలో ఇటీవల నిర్వహించినట్లు చెప్పారు. బుధవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినిని అభినందించి మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి హృదయరాజ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు

- తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలో వివిధ ప్రభుత్వ స్థలాలల్లోను, ఇరిగేషన్ భూములలో ఉన్న నివాసాలు తొలగిస్తారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలో ఇప్పటి వరకు లబ్ధిదారులందరికీ ఇళ్ల స్థలాలను ప్రభుత్వం అందజేసిందని, వారితో పాటు అభ్యంతరకర స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి కూడా పట్టాలు అందజేశామని, ఇళ్ల పట్టాలు ఇచ్చారు కాబట్టి ఇళ్లు తొలగిస్తారంటూ కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రస్తుతం అలాంటి ఆలోచన లేదని, ఇప్పటి వరకు ఇళ్ల తొలగింపుపై ఎటువంటి నోటీసులు అందలేదని, మహానాడులో నివసించే వారికి నోటీసులు ఇచ్చారని, నులకపేటలో వారికి ఎన్‌టీఆర్ కరకట్ట మీద నోటీసులు ఇచ్చారని ప్రచారం చేస్తున్నారని వాటిని ప్రజలు ఎవరూ నమ్మవద్దని తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి అన్నారు. అలాంటి ప్రచారాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

విద్యుత్ లోఓల్టేజీ సమస్యకు చెక్



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని టిడ్కో నివాసాలతో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ ఓల్టేజీ సమస్యలు తీవ్రంగా ఉండడంతో వినియోగదారులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన వెంటనే విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడడంతో పలుచోట్ల మరమ్మతులు నిర్వహించేందుకు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు ఆ శాఖ రూ.7 కోట్ల నిధులు కేటాయించింది. మంగళగిరి పట్టణంలో బుధవారం పనులు ప్రారంభమయ్యాయి. మంగళగిరి పట్టణ పరిధిలో టిడ్కో, రాజీవ్ గృహకల్ప, మార్కండేయ కాలనీ, మన్నెం వారి బజార్ పరిసర ప్రాంతాల్లో లో ఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు జర్మన్ ఎ.ఐ.ఎస్. టెక్నాలజీ నిర్మాణంతో జరుగుతున్న సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మించారు. త్వరలోనే పనులు పూర్తిచేసి లో ఓల్టేజ్ సమస్యను అధిగమించనున్నట్లు విద్యుత్ శాఖ ఇంజనీరింగ్ అసిస్టెంట్ అక్కల సత్యనారాయణ తెలియజేశారు.

మైనార్టీల అభివృద్ధికి సీఎం జగన్ కృషి ఎనలేనిది

ఫిరంగిపురం: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీ వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన కృషి ఎనలేనిదని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా అన్నారు. మండలంలోని అమీనాబాద్ వేములూరిపాడు గ్రామాల్లోని నాలుగు మసీదుల్లోని (సర్) మతపెద్ద లు, ఇమామ్‌లతో కలిసి (హర్ దిల్‌మే వైఎస్సార్ హమ్‌సబ్ జగన్‌కే సాత్) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముస్లిం మైనార్టీలకు చేసిన అభివృద్ధి గురించి వివరించామన్నారు. ఇమామ్, మౌజన్‌లకు ప్రభుత్వం ప్రతినెలా గౌరవవేతనం ఇస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఇప్పటివరకు అందనివారు వివరాలు అందజేస్తే, వారికి గౌరవవేతనం లభించేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోని మసీదుల ప్రహరీల నిర్మాణాలకు, కొద్దిపాటి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు మైనార్టీ వర్గాల అభివృద్ధికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఇంటింటికి తిరిగి వివరించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమం ఆరు నెలలపాటు కొనసాగుతుందని చెప్పారు. అర్హులై ఉండి ఇప్పటి వరకు లబ్ధిపొందని మైనార్టీలు ఉంటే వారి సమస్యలు తెలియజేస్తే, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

నందివెలుగులో కాల్వలపై ఫుట్ బ్రిడ్జిల ఏర్పాటు

- రూ. 22.50 లక్షలతో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: నందివెలుగు అంబేడ్కర్ నగర్ ప్రజల చిరకాల కోరిక నెరవేరుస్తున్నామని, పశ్చిమ, నిజాంపట్నం కాలువలపై ఫుట్‌బ్రిడ్జి రూ.22.50 లక్షలతో నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో మూడోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే శివకుమార్, ఎంపీపీ శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు, వలంటీర్లు, సచివాలయ, పంచాయతీ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం అంబేడ్కర్ నగర్‌లో ఇంటింటికి వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో ప్రజలు కాల్వలపై వంతెన నిర్మించాలని కోరారని, వారి కోరిక మేరకు రెండు నెలల్లో వంతెన నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పెన్షన్ తీసుకుంటున్న అవ్వాతాతలు ఆనందంగా ఉన్నారని, వారి జీవనానికి పెన్షన్ ఎంతగానో అండగా ఉందన్నారు. గ్రామంలో రూ. 25 కోట్లు సంక్షేమ పథకంలో భాగంగా వివిధ అభివృద్ధి పథకాల ద్వారా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. బాధ్యతతో పనిచేస్తున్నామని, ముఖ్యమంత్రికి ప్రజలందరూ అండగా ఉండాలని ఎమ్మెల్యే శివకుమార్ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్, ఎంపీటీసీ షేక్ సిలార్‌జానీ, ఎంపీడీఓ విజయలక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి సుభాస్‌చంద్రబోస్, సొసైటీ చైర్మన్ తోటకూర వసంతరావు, మాజీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు వేముల మహేష్, గొంతు నరేంద్రరెడ్డి, కె.రాజమోహన్, తన్నీరు వెంకటేశ్వరరావు, ధూళిపాళ్ల దుర్గాప్రసాద్, పానకాలు, మాజీ సర్పంచ్ మంగా కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ నాగేశ్వరరావు, బి.బాజీ, మంగ చిట్టిబాబు, కవాతుల స్వామి, శాంతిరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రారెత్తిస్తున్న టమాట ధర

- మిర్చి ధర చెప్పగానే కంటనీరు
- మార్కెట్లో పెరిగిన ధరలు



మార్కెట్లో రాశి పోస్తున్న టమాటలు

తెనాలి: టమాటోలు కూరకు కలిసొస్తాయి. ఏ కూరలోనైనా చేర్చుకుంటే అదనపు రుచి వస్తుంది. అందుకే వీటి వినియోగం అధికం. ప్రస్తుతం టమాటో ధరలు మార్కెట్లో మండి పోతున్నాయి. పచ్చి మిర్చి ఘాటు నషాళానికెక్కుతోంది. కొన్ని తీగె జాతి కూరగాయల్లోనూ ఈ పెరుగుదల కనిపిస్తోంది. ఫలితంగా వినియోగదారులు కూరగాయలకు ధరాభారమైంది. స్థానిక మార్కెట్లో రూ.40–45లుగా ఉన్న టొమాటో ధర 24 గంటలు గడిచేసరికి రెట్టింపయింది. గత రెండురోజులుగా కిలో టమాటోలకు రూ.80 పెట్టాల్సి వస్తోంది. దీనికితోడు పచ్చిమిర్చి ధర టమాటోకు మించిపోయింది. రైతు బజారులోనే 98 రూపాయలు పలుకుతోంది. ఏ కూర వండుకున్నా పచ్చి మర్చి లేకుండా కుదరదు కదా! రోహిణి కార్తె ఎండలతో బేజారెత్తిన ప్రజలకు, నైరుతి రుతుపవనాలు పన్నీటి జల్లును కురిపించాయి. గత మూడురోజులుగా జనం చల్లగాలి ఆనందాన్ని అనుభవించారు. ఆ వర్షాలే ఇప్పుడు కూరగాయల ధరల పెరుగుదలకు కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. టమాటో పంటను చిత్తూరు జిల్లా మదనపల్లి ప్రాంతం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. పచ్చి మిర్చి మైదుకూరు నుంచి వస్తోంది. భారీ వర్షాలకు ఆయా ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయట! ఫలితంగా అక్కడ్నుంచి కొనుగోలు రేటే అధికంగా ఉండడంతో ధరలు ఇలా ఉన్నాయని చెబుతున్నారు. వ్యాపారుల సంగతలా ఉంచితే కూరగాయల ధరలు మరీ ఇంతగా పెరిగితే ఎలాగని వినియోగదారులు సణుక్కుంటున్నారు. డెల్టా ప్రాంతంలో కూరగాయల సాగు విస్తీర్ణం తక్కువని తెలిసిందే. అక్కడక్కడా మాగాణి భూముల్లో వేసిన తీగె జాతి కూరగాయల తోటలు కాపు అయిపోయి, ఖరీఫ్ వరి సాగుకని తీసేశారు. ఫలితంగా వాటి దిగుబడి తగ్గి, ఆ ప్రభావం ధరలపై పడింది.

రైతు మహాధర్నాను విజయవంతం చేద్దాం

కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ములకా శివసాంబిరెడ్డి

కొల్లిపర: ఈనెల 30న విజయవాడలో అలంకార సెంటరులో జరిగే రైతు మహాధర్నాను రైతులు, కౌలు రైతులు భారీగా పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని దావులూరు, తూములూరు, హనుమాన్ పాలెంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది భారీ వర్షం కారణంగా ఖరీఫ్ రబీ సీజల్లో వరి, జొన్న , మొక్కజొన్న కౌలు రైతులకు పంట నష్టపరిహారం చెల్లించి, పంటల బీమా ఇవ్వాలన్నారు. నూటికి 70 శాతం ఉన్న కౌలు రైతులను ప్రతి బ్యాంకు వారు గుర్తించి వారికి కూడా బ్యాంకు రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో పాడి రైతులకు లీటరు పాలకు 4 రూపాయల బోనస్ ఇచ్చి 50 శాతం రాయితీతో గేదెలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్దన సాంబశివరావు, పేట శ్రీనివాసరావు, అద్దంకి నాగేశ్వరరావు, యేమినేని వెంకటేశ్వరరావు, కొల్లి కిరణ్‌రెడ్డి , మర్రెడ్డి బాపిరెడ్డి, శ్రీనివాసరావు, ఉపాల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల ఆదాయం రూ.3.06 లక్షలు



తెనాలి: పట్టణంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీరామేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. మొత్తం రూ.3,06,943లు వచ్చాయని ప్రకటించారు. స్థానిక గాడిబావి సెంటర్లోని శ్రీసీతారామస్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి వై.అమర్‌నాథ్ పర్యవేక్షణలో భక్తులు శ్రీనివాసరావు, కిశోర్, భక్తబృంద సభ్యులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ వీవీ రమణకుమారి, వ్యవస్థాపక ధర్మకర్తలు ఎస్‌బీ శివ, కె.భాస్కరరావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థను స్థిరమైన గమ్యానికి చేర్చిన పీవీ



శతచండీయాగానికి రూ.2 లక్షల విలువైన వనరుల పంపిణీ

తెనాలి: భారతదేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న కాలంలో ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తెలుగునేత పీవీ నరసింహారావు స్థిరమైన గమ్యానికి చేర్చిన మహనీయుడని బ్రాహ్మణ పరిషత్ నాయకులు స్మరించుకున్నారు. భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతిని స్థానిక బోసురోడ్డులోని ఆయన విగ్రహం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర ఆపన్న ప్రదీపనా బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గౌరవ సలహాదారు యనమద్రసాయి సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 1921లో సాధారణ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన పీవీ నరసింహారావు బహుభాషాకోవిదుడని గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సమర్థంగా పనిచేసి, భారతదేశానికి తొలి తెలుగు ప్రధానిగా దేశ పరిపాలనలో తనదైన ముద్ర వేశారని చెప్పారు. ఆర్థిక సరళీకరణ విధానాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ఇంతటి మహనీయుడైన పీవీకి భారతరత్న ఇవ్వాలని సురేష్ కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఇదే వేదిక నుంచి సురేష్ దంపతులు త్రిపురాంతకంలో శతచండీయాగం నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన విష్ణుబట్లవారికి రూ.2 లక్షల విలువైన ఆవు నెయ్యి, బియ్యం, దీక్షా వస్త్రాలను బ్రాహ్మణ పరిషత్ ద్వారా అందజేశారు. పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు పరాశరం వెంకట రామగోపాల్, పోతావఝుల పరుషోత్తమశర్మ, పెద్దిరాజు సత్యం, వంగల మాధవరావు, చెన్నాప్రగడ శ్రీనివాసరావు, దావులూరి శ్యాంసుందరశర్మ, చిలకలపూడి గోపాలకృష్ణ, మాగంటి వీఎస్ఆర్ శాస్త్రి, భాగవతుల రామకృష్ణ, దీవి శ్రీనివాసాచార్యులు, ఎస్ఆర్‌కే శర్మ, లక్కరాజు లక్ష్మణరావు, లక్కరాజు దుర్గ, పిసపాటి శివరామకృష్ణ శాస్త్రి, ప్రయాగ కృష్ణ, కావూరి సత్యనారాయణ, నేతి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి పాటుపడిన డాక్టర్ పిరాట్ల



డాక్టర్ పిరాట్ల నారాయణమూర్తి ,చిత్రపటం వద్ద వివిధ రంగాల ప్రముఖుల నివాళి

తెనాలి: ఇటీవల మృతిచెందిన పట్టణానికి చెందిన విశ్రాంత ప్రొఫెసర్, శ్రీసీతారామ గానసభ అధ్యక్షుడు డాక్టర్ పిరాట్ల నారాయణమూర్తి సంతాపసభను బుధవారం చినరావూరు గోలీడొంకలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణ సంక్షేమానికి అహర్నిశలు పాటుపడిన నారాయణమూర్తి, అటు సంగీతసేవను, దాతృత్వ కార్యక్రమానికి నిర్వహించారని సభకు అధ్యక్షత వహించిన తాడేపల్లి సూర్యనారాయణమూర్తి చెప్పారు. యూనివర్శిటీ ప్రొఫెసర్‌గా ఆయన గైడ్‌గా 39 మంది డాక్టరేట్‌ను పొందినట్టు తెలిపారు. బ్రాహ్మణుల అపరకర్మల నిమిత్తం శాశ్వత భవనం ఏర్పాట్లుచేసి, విప్రధర్మస్థలి సంస్థను దీక్షతో నడిపిన ధన్యజీవిగా పేర్కొన్నారు. దుర్భా హరిబాబు శాస్త్రి మాట్లాడుతూ శ్రీసీతారామ గానసభకు నిధుల సేకరించి నిర్విఘ్నంగా సంగీత సేవను కొనసాగించిన సూర్యనారాయణమూర్తి గొప్ప కళాపోషకుడుగా చెప్పారు. ఆంధ్రాబ్యాంకు విశ్రాంత రీజినల్ మేనేజరు పరుచూరి సుబ్బారావు తన ప్రసంగంలో గానసభ అధ్యక్షుడిగా ఎందరికో సంగీతంపై అభిరుచిని కలిగించారని చెప్పారు. విప్రధర్మస్థలికి చేసిన సేవలను బీవీఎస్ శాస్త్రి వివరించారు. చీరాల చైతన్యభారతి కార్యదర్శి భాగి నారాయణశాస్త్రి, ప్రముఖ మృదంగ విద్వాంసుడు కానూరి వెంకటరామకృష్ణ తదితరులు మాట్లాడారు. తొలుత నారాయణమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం జశ్వంతరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. కౌన్సిలర్‌లు, కో అప్షన్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

నేడు తెనాలిలో గోవధ నిషేధం



ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మలా, ముస్లిం మత పెద్దలు

తెనాలిఅర్బన్: బక్రీదు పండుగను పురస్కరించుకుని గురువారం తెనాలిలో గోవధ నిషేధించడం జరిగిందని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మలా పేర్కొన్నారు. పట్టణంలోని ముస్లిం మత పెద్దలతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 1977లో రూపొందించిన గోవధ నిషేధ చట్టం అమలులో ఉందని చెప్పారు. ఆవులను, దూడలను, పాలిచ్చే గేదెలు, వ్యవసాయానికి ఉపయోగపడే ఎద్దులను, ఒంటెలను ఎవరు వధించవద్దని సూచించారు. అలాగే కబేళాలోని వెటర్నరీ డాక్టర్ పరీక్ష జరిపిన తర్వాత మాత్రమే వేట మాంసం విక్రయాలు జరపాలన్నారు. ప్రభుత్వ నిబంధలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మార్కెట్ వద్ద ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో రుసుం లేని సేవలు

- ధృవీకరణ పొందడానికి కావాల్సిన పత్రాలు
- స్థానికంగానే అన్ని సేవలు ఉచితం



23వ వార్డు సచివాలయంలో జగనన్న సురక్షపై జరుగుతున్న అవగాహన సదస్సు

తెనాలి: 'జగనన్న సురక్ష ప్రోగ్రాం...రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మరో నూతన కార్యక్రమం. 'జగనన్నకు చెబుదాం'కు కొనసాగింపుగా నెలరోజులపాటు జరిగే కార్యక్రమంలో ప్రజలకు సంతృప్త స్థాయిలో సేవలను అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. తొలుత ఈనెల 24 నుంచి వలంటీర్లు వారి క్లస్టరులో ఇళ్లను సందర్శిస్తారు. ప్రతి ఇంటిలో కొద్ది నిముషాలు గడిపి వారికి అందిన సంక్షేమ పథకాల గురించి తెలుసుకుంటారు. రావాల్సిన ధృవీకరణ పత్రాలను ఆరాతీస్తారు. నమోదుచేసుకుని వారికో టోకెన్ ఇస్తారు. జులై ఒకటో తేదీనుంచి సచివాలయాల స్థాయిలో జగనన్న సురక్ష క్యాంపుల్లో ఆయా ధృవీకరణ పత్రాలను అందజేస్తారు. క్యాంప్ సమయంలో 11 రకాల సేవలకు ఎలాంటి సేవా రుసుములు ఉండవు. ఆయా సేవలకు అవసరమైన పత్రాలను దిగువనివ్వటమైనది.

1.కులధృవీకరణ పత్రం: ఆధార్ కార్డు, రేషను కారు 10వ తరగతి టీసీ, పాత కులధృవీకరణ పత్రం, అప్పటికే కుటుంబ సభ్యుడికి ఎవరికైనా ఇంటిపేరుతో సహా ఇచ్చిన ఉన్న సర్టిఫికెట్ జిరాక్సులు.

2.ఆదాయ ధృవీకరణ పత్రం: ఆధార్ కార్డు, రేషను కార్డు జిరాక్సులు

3.జనన ధృవీకరణ పత్రం: జననాన్ని ధృవీకరించే ఏదైనా ఆధారం, అఫిడవిట్, బర్త్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషను కార్డు జిరాక్సులు

4.మరణ ధృవీకరణ పత్రం: దరఖాస్తు, మరణాన్ని ధృవీకరించే ఏదైనా ఆధారం, అఫిడవిట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషను కార్డు జిరాక్సులు

5.మ్యుటేషన్, టైటిల్‌డీడ్ కమ్ పట్టాదారు పుస్తకం: దరఖాస్తు, రిజిస్టరు డాక్యుమెంట్లు, పాత పట్టాదారు పుస్తకం/ టైటిల్‌డీడ్, పన్ను రశీదులు, ఇటీవల దిగిన పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, సంతకాలు

6.వివాహ ధృవీకరణ పత్రం: దరఖాస్తు, పెళ్లి ఫొటో, శుభలేఖ, పెళ్లికూతురు, పెళ్లికొడుకుల ఆధార్ జిరాక్సులు, ఏదైనా నివాస ధృవీకరణ (రేషను కార్డు, ఆధార్ కార్డు, టెలిఫోన్ బిల్లు, కరెంటు బిల్లు, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, జాబ్ కార్డు)

7.ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్: దరఖాస్తు, మరణించిన వ్యక్తితో సంబంధం, వయసు, పేరుతో సహా నోటరీ చేసిన అఫిడవిట్, దరఖాస్తుదారుకు చనిపోయిన వ్యక్తితో గల సంబంధాన్ని ధృవీకరించే ఏదైనా పత్రం (రేషనుకార్డు, ఓటరు కార్డు, పాస్‌పోర్టు, పాస్‌బుక్, ఆధార్ కార్డు వంటివి)

8.భూమిరికార్డుల్లో మొబైల్ నంబరు, పట్టాదారు ఆధార్ సీడింగ్: మీసేవ దరఖాస్తు, ఆధార్ కార్డు జిరాక్స్

9.కౌలురైతు గుర్తింపు కార్డు: ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, భూమి యజమాని అంగీకార పత్రం, దరఖాస్తు

10.కొత్త రేషనుకార్డు/ కార్డులో పేరు విభజన: దరఖాస్తు, ఆధార్‌కార్డులు, పాత రేషనుకార్డు, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ (కొత్త రేషనుకార్డుకోసం)

11.హౌస్‌హోల్డ్ విభజన: దరఖాస్తు, ఆధార్‌కార్డులు, వివాహ సర్టిఫికెట్/ రేషను కార్డు/ఆరోగ్యశ్రీ కార్డు వంటివి.

దుగ్గిరాలలో అభివృద్ధి పనులు



ఎస్సీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులు



ఆర్‌సీఎం చర్చి వద్ద పూర్తి చేసిన సీసీ రోడ్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని జిల్లా మైనింగ్ శాఖ నుంచి సుమారు రూ.4 కోట్ల నిధులు విడుదల కావడంతో దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి, చినపాలెం గ్రామాల్లో బుధవారం రూ.27 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. తుమ్మపూడి గ్రామంలో ఆర్‌సీఎం స్కూల్ వద్ద సుమారు రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణం పూర్తికాగా, రూ.17 లక్షల ఖర్చుతో చినపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి తెలిపారు. మైనింగ్ శాఖ నుంచి విడుదలైన రూ. 4 కోట్లతో 18 గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో....

మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సొంత నిధులతో పెనుమూలిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చింతలపూడి శ్మశాన వాటిక, పలు చోట్ల గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు, పెరుకలపూడి హెడ్ స్లూయిస్ మరమ్మత్తులు ఎమ్మెల్యే సొంత నిధులతో చేస్తున్నట్లు, వాటిని గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులు ఖర్చుచేసి అభివృద్ధి పనులు చేపట్టడంపై ఆ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

తెనాలి తహసీల్దార్‌కు రివర్షన్

గుంటూరు వెస్ట్: గతంలో పాల్పడిన అవకతవకలు రుజువు కావడంతో తెనాలి తహసీల్దారు కె.రవిబాబును డెప్యూటీ తహసీల్దారుగా రివర్షన్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఆయన గతంలో కొత్తపట్నంలో తహసీల్దారుగా పనిచేస్తున్న సమయంలో 124 ఎకరాల భూమిని 14 మందికి బదిలీ చేస్తూ వెబ్‌ల్యాండ్‌లో అక్రమంగా నమోదు చేయించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ ఎంక్వైరి చేపట్టింది. అక్రమంగా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన అంశం వెలుగు చూసింది. దీంతో ప్రస్తుతం తహసీల్దారుగా ఉన్న రవిబాబును డెప్యూటీ తహసీల్దారుగా రివర్షన్ ఇచ్చింది.

కేఎల్‌యూను సందర్శించిన జపాన్ ఐటీ కన్సల్టెన్సీ బృందం



జపాన్ ఐటీ కన్సల్టెన్సీ హెచ్‌ఆర్ ఆఫీసర్ యుజి సెక గుచిని సత్కరిస్తున్న ప్రొ వీసీ డాక్టర్ ప్రసాద్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీని జపాన్ ఐటీ కన్సల్టెన్సీ హెచ్‌ఆర్ బృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఉద్యోగాల కల్పన డీన్ డాక్టర్ ఎస్.బి.వి. ప్రసాద్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న విద్యార్థులకు జపాన్ ఐటీ కంపెనీలలో ఉద్యోగాలను కల్పించడానికి జపాన్‌కు చెందిన జీఐటీ కన్సల్టెన్సీ మానవ వనరుల విభాగానికి చెందిన కార్పొరేషన్ ప్రతినిధులు విచ్చేశారని తెలిపారు. మానవ వనరుల ముఖ్య అధికారి యుజిసెక గుచి, సెలక్టింగ్ కమిటీ సభ్యులు టకుయకగొటని, హోసక కటోలతో పాటు చెన్నైకు చెందిన సెంథిల్ సెల్లప్పన్ అనే జపాన్ ప్రతినిధి వర్సిటీలో ప్లేస్‌మెంట్స్, అకడమిక్ టీమ్‌తో సమావేశమయ్యారని వివరించారు. విశ్వవిద్యాలయ ప్రొ.చాన్సలర్ ఏవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు ఆకర్షణీయమైన జీతంతో పాటు పలు రాయితీలను ఇవ్వడానికి కంపెనీ వారు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. కేఎల్‌యూలో జపాన్ భాషను నేర్చుకుని విద్యార్థులతో జపాన్ భాషలో ముచ్చటించిన జపాన్ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. గత విద్యా సంవత్సరంలో కేఎల్‌యూ నుంచి 10 మంది విద్యార్థులు సంవత్సరానికి 42,37,236 జపాన్ యెన్స్ జీతాన్ని పొందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఉద్యోగాల కల్పన సీనియర్ డైరెక్టర్ జె.శరవణ బాబు, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రామకృష్ణ, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్లు అందజేత



తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని వీటీజేఎం, ఐవీటీఆర్ స్కిల్ హబ్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ వారికి బుధవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గొడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ఏపీఎస్ఎస్‌డీసీ వారు తమ కళాశాలలో స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేశారని, మొదటి విడతలో డేటాఎంట్రీ ఆపరేటర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులలో 3 నెలల పాటు 55 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చామని, అందులో సుమారు 40 మందికి ఇప్పటికే ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణ అవకాశాన్ని నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెంటర్ ఇన్‌చార్జి పి.శ్రావణి మాట్లాడుతూ రెండవ బ్యాచ్ జూలై 1 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. కె.రామకృష్ణ, ట్రైనర్ కె.సౌజన్య, ప్రేమ, విద్యార్థులు పాల్గొన్నారు.